ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.24.09.2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. గ్రూప్ వన్ పరీక్షల నిర్వహణపై ఇటీవల హైకోర్టు సింగిల్ బెంచ్ వెలువరించిన తీర్పును డివిజన్ బెంచ్ కొట్టివేసింది.
2. కొత్తగా రేషన్ కార్డులు అందని నిరుపేదలు దరఖాస్తులు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.
3. జీఎస్టీ సంస్కరణల తర్వాత వస్తువుల ధరలు వ్యాపారులు తగ్గించకపోతే వినియోగదారులు ఫిర్యాదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ను కేటాయించింది.
4. ఈ రోజు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం యెల్లో హెచ్చరిక జారీ చేసింది.

-------------------

**Group -I**

రాష్ట్రంలో గ్రూప్ 1 పరీక్ష ఫలితాలపై రాష్ట్ర హై కోర్టు డివిజనల్ బెంచ్, సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించింది. తదుపరి విచారణనూ వచ్చే నేలా 15 కు వాయిదావేసింది. తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ దాఖలు చేసిన అప్పీలుపై డివిజనల్ బెంచ్ ఈ మేరకు ఈ రోజు ఆదేశించింది. ఈ విషయమై ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, రీ వాల్యుయేషన్ సర్వీస్ నిబంధనల ఆధారంగా ఉండాలన్నారు. 14 ఏళ్ల తర్వాత గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరిగాయన్నారు. కాగా, సింగిల్ బెంచ్ తీర్పులో సున్నితమైన పదాలు ఉన్నాయని అభిప్రాయపడ్డ హైకోర్టు, అవకతవకలకు ఆధారాలు చూపాలని కక్షిదారులకు సూచించింది.

**MSL**

-----------------------

**హైదరాబాద్ పొన్నం**

గడిచిన కొన్నేళ్లుగా ఆచరణకు నోచుకోని పనులు ఇప్పుడు అమలవుతున్నాయని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని ఎన్ బీటీ నగర్ లో 93లక్షల 50వేల రూపాయలతో నిర్మించిన మహిళా భవన్ ను స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి ఆయన ప్రారంభించారు. అలాగే, 29 లక్షల రూపాయలతో నిర్మించనున్న అంగన్ వాడీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేషన్ కార్డుల పంపిణీ మొదలయ్యిందని.. ఇంకా రేషన్ కార్డులు రానివాళ్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**పీఎస్**

--------------------

**తుమ్మల తనిఖీ**

వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫెడ్ పనితీరు, నిర్వహణ, ఉద్యోగుల హాజరు, రైతులకు అందిస్తున్న సేవలపై మేనేజింగ్ డైరెక్టర్ శంకరయ్యతో సమీక్ష నిర్వహించారు. సమయపాలన పాటించని సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎండీని మంత్రి ఆదేశించారు.

**డెస్క్**

-------------------

**జీసీసీ శ్రీధర్ బాబు**

హైదరాబాద్ లో "హెచ్‌సీఏ హెల్త్ కేర్" సంస్థ మొదటి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఈ ఉదయం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ యేడాది చివరి నాటికి ఇందులో ఈ సంస్థ 75 మిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టనుందని, వచ్చే యేడాది నాటికి

ఈ సెంటర్ లో 3వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తారని, ఐటీ, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది.

**ఫీఎస్**

-----------------------

**సేవ పర్వ్ -12**

**ఇండియా AI మిషన్**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం సేవా-సుపరిపాలనే మంత్రంగా దేశంలో పరివర్తన కోసం నిరంతరం కృషి చేస్తోంది. సేవా పర్వ్ - సీరీస్ లో భాగంగా, మోదీ ప్రభుత్వం ఇండియా AI మిషన్ తో భవితవ్యం దిశగా దేశాన్ని తీర్చిదిద్దుతున్నా వైనంపై ప్రత్యేక కథనం అందిస్తున్నాము.

**(క్యాప్సూల్)**

*ప్రస్తుతం మన జీవన విధానాన్ని మార్చివేసే విప్లవం కృత్రిమ మేధస్సు (AI). సాధ్యాసాధ్యాలను తిరిగి నిర్వచించే సామర్థ్యం ఉన్న భావి పరిజ్ఞానమ్. నరేంద్ర మోదీ ప్రభుత్వం గత ఏడాది మార్చిలో పదివేల మూడు వందల కోట్ల రూపాయలకు పైగా అంచనా వ్యయంతో  ఇండియా AI మిషన్‌ను ఆమోదించింది.  AI అభివృద్ధిలో మనదేశం అగ్రగామి దేశాలలో ఒకటి. దేశంలో AI పని తీరుపై ప్రధానమంత్రి మోడీ ఇలా అన్నారు.

**(PM BYTE- AI-1)**

భారీ కంప్యూట్ సామర్థ్యం, ఆవిష్కరణ కేంద్రాల నిర్మాణం, డేటా సెట్‌లను అభివృద్ధి చేయడం, స్టార్టప్‌లను ప్రోత్సహించటం, సురక్షియత AI వినియోగం అనే పునాదులపై India AI మిషన్ ఆధారపడింది. ప్రజలే కేంద్రంగా సాంకేతికతను విశ్వజనీనం చేయటమే మిషన్ ఉద్దేశ్యం అని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ వివరించారు.

**(ASHWINI VAISHNAW - BYTE)**

IndiaAI అనేది ఒక చర్యమాత్రమే కాదు; ఇది ఒక దార్శనికత - దేశాన్ని సమగ్రమైన బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు రంగంలో అగ్రస్థానంలో ఉంచి 2047 నాటికి విక్షసిత్ భారత్ కోసం డిజిటల్ పునాదులను నిర్మించడమే మిషన్ ఉద్దేశ్యం.

**MSL**

----------------------------

**మోదీ విషెస్**

శరన్నవరాత్రుల్లో మూడవ రోజున చంద్రఘంట మాత ఆశీస్సులు పొందాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు. అమ్మవారిని శాంతి, ధైర్యం, నిర్భయతకు ప్రతీకగా ఆయన అభివర్ణించారు. ప్రతి ఒక్కరి జీవితంలో చంద్రఘంటమాత సానుకూలతను నింపుతుందని, ఆమె కృప దేశవ్యాప్తంగా అందరికీ ఆనందం, శ్రేయస్సు, అదృష్టాన్ని తీసుకురావాలని ప్రధానమంత్రి సోషల్ మీడియా పోస్ట్ లో ఆకాంక్షించారు.

**ఎస్ఎస్ డీ**

--------------------

**జీఎస్టీ కాంప్లెయింట్స్**

వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణల తర్వాత తగ్గిన ధరల ప్రయోజనాలు సామాన్య ప్రజలకు అందుతున్నాయో లేదో నిర్ధారించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. జీఎస్టీకి అనుగుణంగా వస్తువుల ధరలు తగ్గించకుంటే.. వినియోగదారులు నేరుగా ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్, వాట్సాప్ నెంబర్ ను అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారులు 1915 అనే టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, 88000 01915 అనే వాట్సాప్ నెంబర్ ద్వారా 17 భాషల్లో ఫిర్యాదులు చేయవచ్చని వెల్లడించింది. అలాగే, తమ సమీకృత గ్రీవెన్స్ రీడ్రెసెల్ మెకానిజమ్ పోర్టల్ ద్వారా కూడా వినియోగదారులు ఫిర్యాదులు చేయవచ్చునని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) ఒక ప్రకటన విడుదల చేసింది.

**పీఎస్**

----------------------------

**సిరిసిల్ల స్వస్థనారీ**

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ లో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

డాక్టర్ రజిత చెప్పారు. ఆకాశవాణితో ఆమె మాట్లాడుతూ.. వచ్చేనెల 2 వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ వైద్యశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

**సౌండ్ బైట్ - డాక్టర్ రజిత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ**

**పీటీసీ సిరిసిల్ల**

--------------------------------

**సింగరేణి**

సింగరేణి సీఎండీ ఎన్.బలరాం ఆదేశాల మరకు 1258 మంది బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరణ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2024 డిసెంబర్ 31 కన్నా ముందు సంవత్సరకాలం సర్వీసు చేసిన వారికి ఈ అవకాశం కల్పించారు. భూగర్భ గనుల్లో అయితే 190 మస్టర్లు, ఓపెన్ కాస్ట్ గనుల్లో లేదా సర్ఫేస్ లో అయితే 240 మస్టర్లు పూర్తి చేసి ఉన్న బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్ కేటగిరి-1 గా క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు క్రమబద్ధీకరణ ప్రతిపాదనలు పంపించాల్సిందిగా జనరల్ మేనేజర్ ఈరోజు అన్ని ఏరియాలకు ఒక సర్క్యులర్ జారీ చేశారు.

**పీఎస్**

------------------------

**BJP**

BJP కార్యవర్గ సమావేశం హైదరాబాద్ లోని పార్టీ కార్యాలయంలో జరుగుతోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు N రామచంద్రరావు నేతృత్వంలో కొత్తగా ఏర్పాటయిన కార్యవర్గం సమావేశం అయింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో పంచాయితీ ఎన్నికల నిర్వహణ, BC రిజర్వేషన్ల గుర్తింపు సహా పలు అంశాలపై చర్చిస్తున్నారు.

**MSL**

------------------------------

**హరీష్ రావు**

కృష్ణా జలాల్లో రాష్ట్రానికి రావాల్సిన వాటాపై ముఖ్యమంత్రి రేవంత్ ఒక మాట, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రేడ్డి మరో మాట మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. గతంలో ముఖ్యమంత్రి క్రిష్ణా బేసిన్ నుంచి తెలంగాణకు 500 టీఎంసీల కేటాయిపునకు ఎన్ఓసీ  కోరారని, ఈనెల 13వ తేదీన నీటిపారుదల శాఖ సమీక్షలో క్రిష్ణా జలాల్లో 904 టీఎంసీల వాటా సాధించాలని అన్నారని, ఇప్పుడు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాత్రం 763 టీఎంసీల వాటా కావాలంటున్నారని, ఈ విషయంలో స్పష్టత లేదని హరీష్ రావు అన్నారు.

**పీఎస్**

----------------------------

**సిద్ధిపేట స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్**

"స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, బస్తి దవఖానాల్లో  మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు.  జిల్లా పైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ ఆకాశవాణితో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు జిల్లాలో 29వేల 613 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని చెప్పారు.

**సౌండ్ బైట్ : జిల్లా పైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్. ధనరాజ్**

**పీటీసీ సిద్ధిపేట**

---------------------------

**ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు**

రాష్ట్రంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్(ఏఏఎం)ల సంఖ్య పెరగనుంది. ఇప్పటివరకు 3వేల 206 ఏఏఎంలు ఉండగా.. త్వరలో వీటి సంఖ్య  4వేల 745కు చేరనుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం గతంలో ఏఏఎంలుగా ఉన్నతీకరించింది.

**డెస్క్**

----------------------------

**వెదర్**

ఈరోజు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. అన్ని జిల్లాల్లోనూ ఈ పరిస్థితి ఉంటుందని యెల్లో అలర్ట్ జారీ చేసింది. మరోవైపు.. బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో ఈ నెల 26, 27 తేదీల్లో రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

**పీఎస్, డెస్క్**

--------------------------

**కరీంనగర్ నవరాత్రి**

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవం జరుగుతున్నాయి. అమ్మవారి మండపాలలో దుర్గ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

**పీటీసీ కరీంనగర్**

----------------------------